# అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తా

- కార్యకర్తలకు అండగా ఉంటా
- మంచిర్యాల తాజా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న మంచిర్యాల తాజా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 5 : నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేసి, నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలందించిన తాను ఈ సారి జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, తన కోసం పాటుపడ్డ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తానని మంచిర్యాల తాజా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని అన్నారు. కొత్తగా ఏర్పడుతున్న ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు మూడు సార్లు అధికార పక్షంలో, ఒకసారి ప్రతిపక్షంలో ఉన్నానని, అయితే ప్రజల కోసమే పని చేశానని, నిరంతరం అభివృద్ధి కోసం తపించానని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే తన పాలన సాగిందన్నారు. ఎన్నికల్లో నిస్వార్థంగా కార్యకర్తలు పట్టుకొమ్మల్లా గెలుపు కోసం పని చేశారని, వారందరికీ రుణపడి ఉంటానని అన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన పనులు చేశానని, గూడెం లిఫ్ట్, ఎల్లంపల్లి ప్రాజెక్టు, ముల్కల ప్రాజెక్టు, కడెం లైనింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాల, రైల్వే అండర్‌బ్రిడ్జి, సింగరేణి స్థలాలకు పట్టాలు, ఐటీఐ, కళాశాలలు, పట్టణాలు చూడముచ్చటగా తయారు చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మంచి వాతావరణంలో ఆ ప్రభుత్వం పని చేయాలని కోరారు. గెలిచినా, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు సాగాలని, శాంతియుత మార్గంలో తెలంగాణను సాధించిన కేసీఆర్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో మంచిర్యాల, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య, బీఆర్‌ఎస్ నాయకులు విజిత్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ, నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన జాన్సన్ నాయక్



మాజీమంత్రి కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్

కడెం, డిసెంబర్ 5: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో స్వల్ప తేడాతో ఓటమి కాగా, ఫలితాల అనంతరం ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్‌ను ఆయన ఓదార్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం, గట్టిపోటి ఇచ్చి స్వల్ప తేడాతో ఓటమి చెందిన అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా పార్టీని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలకు అండగా నిలవాలని కేటీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు. అనంతరం జాన్సన్‌నాయక్ కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ, తాను నియోజకవర్గ ప్రజలతో పాటు కార్యకర్తలకు అండగా ఉండి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలంత రెట్టింపు ఉత్సాహంతో కలిసి పని చేయాలని సూచించారు.

## కేజీబీవీని సందర్శించిన ప్యానెల్ టీం

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 5 : సిరికొండలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీల్ ఆధ్వర్యంలో ప్యానెల్ టీం సభ్యులు సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఎఫ్‌ఏ-1, 2, ఎస్‌ఏ-1 రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సంధ్యరాణి, ప్యానెల్ టీం ఉపాధ్యాయులు కాంతయ్య, భాస్కర్, చంద్రకాంత్, శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.



సిరికొండలోని కేజీబీవీని సందర్శించిన ప్యానెల్ టీం

## భక్తులతో కోలాహలంగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్, డిసెంబర్ 5 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఉదయం నుంచే భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయం ముందు భాగంలో ఉన్న పెద్ద రథంపై ప్రతిష్ఠించిన విగ్రహాలను దర్శించుకొని కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 5: మహిళలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. నిర్మల్‌లోని బంగల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా ఎనిమిది రకాలైన ఆరోగ్య సేవలను మహిళలకు అందించాలని కోరారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా అంకితభావంతో పని చేసే అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి రాజేందర్, వైద్యులు మనిషా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతి పనుల పరిశీలన



నర్సరీ పరిశీలిస్తున్న నిర్మల్ జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

సోన్, డిసెంబర్ 5: సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, నర్సరీలను మంగళవారం జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ పరిశీలించారు. పల్లె ప్రకృతివనాల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో కలీం, ఏపీవో మంజుల, ఏపీఎం గంగామణి ఉన్నారు.

## రాపనపల్లిలో పోలీసుల తనిఖీలు

కోటపల్లి, డిసెంబర్ 5 : మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ నెల 8 వరకు పీఎల్‌జీ వారోత్సవాలు కొనసాగనుండగా పోలీసులు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులను ఆధీనంలోకి తీసుకొని అణువణువు జల్లెడ పడుతున్నారు. కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెనతో పాటు రెండు రాష్ట్రాల వెంట ఉన్న ప్రాణహిత తీరం, జాతీయ రహదారిపై విస్తృతంగా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. సరిహద్దులో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో కూంబింగ్ నిర్వహించడంతో పాటు డ్రోన్ కెమెరాతో సరిహద్దులపై మూడో కన్ను పెట్టి పహారా కాస్తున్నారు. వారోత్సవాల సందర్భంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సరిహద్దుల్లో, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించిన, కొత్త వ్యక్తులు కనిపించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్‌ఐ సురేశ్ సూచిస్తున్నారు. కోటపల్లి మండలంలోని బొప్పారం-ఆలుగామ అటవీ ప్రాంతంలో ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆర్‌ఓపీ నిర్వహించి కల్వర్ట్, బ్రిడ్జిలను తనిఖీ చేశారు. ఆ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న వ్యక్తుల వివరాలు తెలుసుకొని వేలిముద్రలను నమోదు చేశారు.



బొప్పారం-ఆలుగామ అటవీ ప్రాంతంలో పోలీసుల కూంబింగ్